క్లుప్తంగా

వైభవంగా ధ్వజారోహణం



ధ్వజారోహణ పూజలు

గూడూరు: బ్రహ్మోత్సవాల్లో భాగంగా పట్టణంలోని శ్రీఅలఘనాథ స్వామి ఆలయంలో శుక్రవారం ధ్వజారోహణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేకాలంకరణ చేసి, వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ పూజలు చేశారు. సంతాన, ఆరోగ్యం కోసం మహిళా భక్తులు స్వామివారి కొడిముద్ద ప్రసాదాన్ని స్వీకరించారు.

ప్రభుత్వ స్థలాలను పరిరక్షిస్తాం

కోట: మండల కేంద్రమైన కోటలో ప్రభుత్వ స్థలాలు, భవనాలను పరిరక్షిస్తామని ఎంపీడీఓ భవానీ తెలిపారు. శుక్రవారం ఆకుతోటదిబ్బ వీధిలో ఉన్న జెడ్పీ గ్రంథాలయ భవనాన్ని పరిశీలించారు. శిథిలావస్థకు చేరుకున్న గ్రంథాలయ భవనం ఆక్రమణకు గురవుతోందని కొందరు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన క్రమంలో అధికారులు పరిశీలించారు. ఆక్రమణలకు గురికాలేదని ఎంపీడీఓ తెలిపారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమించే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఎంఈఓ వెంకటసునీల్ ఉన్నారు.

అనాథ శరణాలయానికి సామగ్రి వితరణ



మంచాలు, సామగ్రితో దాతలు

గూడూరు: అడవయ్య కాలనీలోని గాడ్ గ్రేస్ సొసైటీ అనాథ శరణాలయానికి పది మంచాలు, పరుపులు, దుప్పట్లు తదితర సామగ్రి వితరణ చేశారు. జాన్‌భాస్కర్ జ్ఞాపకార్థం ఎబినైజర్, జెహోషిబాల శుక్రవారం వాటిని అందజేశారు.

గ్యాస్ ధరలు తగ్గించాలని ఆందోళన



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

గూడూరు: పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని కోరుతూ సీపీఐ నాయకులు స్థానిక టవర్ క్లాక్ సెంటర్ వద్ద శుక్రవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలను పెంచుతూ సామాన్యులపై ఆర్థిక భారం మోపుతోందని మండిపడ్డారు. బీజేపీ ప్రభుత్వం కేవలం కార్పొరేట్ శక్తులకు కొమ్మికాస్తుందే తప్ప, సామాన్యుల బాగోగులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు శశికుమార్, కాలేషా, సీవీఆర్ కుమార్, చంద్రయ్య, జమాలుల్లా పాల్గొన్నారు.

జగనన్న స్వచ్ఛ సంకల్పంపై దృష్టి సారించాలి

ఓజిలి: జగనన్న స్వచ్ఛసంకల్పంపై పంచాయితీ కార్యదర్శులు దృష్టి సారించాలని డీఎల్‌పీఓ వెంకటరమణయ్య అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటి పన్నులు వసూలు చేయాలన్నారు. జగనన్న స్వచ్ఛసంకల్పంలో పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేయాలని సూచించారు. వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి లేకుండా కొళాయిలు, తాగునీటి మోటార్ల మరమ్మతులపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రజనీకాంత్, ఈఓపీఆర్డీ సిరాజ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పక్షుల కేంద్రంలో ట్రైనీ ఎఫ్ఆర్ఓలు



బైనాక్యులర్స్ ద్వారా వీక్షిస్తున్న ట్రైనీ ఎఫ్ఆర్ఓలు

దొరవారిసత్రం: హైదరాబాద్‌లోని దూలపల్లి స్టేట్ ఫారెస్ట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న 55 మంది ఎఫ్ఆర్ఓలు శుక్రవారం నేలపట్టు పక్షుల కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రంలో విడిది చేస్తున్న వలస విహంగాలను ఎంతో ఆసక్తిగా బైనాక్యులర్స్ ద్వారా వీక్షించారు. పక్షుల ప్రాముఖ్యతతో పాటు పక్షుల కేంద్రం ప్రాధాన్యతను సూళ్లూరుపేట సబ్ డివిజన్ డీఎఫ్ఓ శామ్యూల్ వారికి వివరించారు. వీరి వెంట స్థానిక ఎఫ్ఆర్ఓ వరప్రసాద్, ఎఫ్ఎస్ఓ బాలయ్య, సిబ్బంది ఉన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి సారథ్యంలో బాలాయపల్లి మండలంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి, జయంపు పీఏసీఎస్ అధ్యక్షుడు వెందోటి కార్తీక్‌రెడ్డి అన్నారు. జయంపు గ్రామంలో నిర్వహించిన మండల స్థాయి వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేసినందుకు పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామాల్లో గోదాములు

- వెయ్యి మెట్రిక్ టన్నుల సామర్థ్యం
- రూ.80లక్షలతో నిర్మాణం



వెంకటరెడ్డిపాళెంలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పీఏసీఎస్ గోదాం

ఓజిలి: రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం రెండు గోదాముల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు పంటలను పండించుకుని గిట్టుబాటు ధరలేక తక్కువ ధరలకు విక్రయించి నష్టపోయేవారు. ఈ రైతుల కష్టాలను నేరుగా పాదయాత్ర సమయంలో చూసిన జగన్‌మోహన్‌రెడ్డి గోదాములు నిర్మాణానికి హామీ ఇచ్చారు. ఆ హామీ కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. మండలంలోని కురుగొండ సహకార సంఘం పరిధిలో వెంకటరెడ్డిపాళెం, గ్రద్దగుంట గ్రామాల్లో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల రెండు గోదాములను నిర్మించేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. వెంటనే నాబార్డ్ నిధులతో ఒక్కో గోదాము రూ.40 లక్షలతో నిర్మాణం చేపట్టారు. వెంకటరెడ్డిపాళెంలోని గోదాము నిర్మాణం పూర్తి కాగా, గ్రద్దగుంటలో గోదాము నిర్మాణం కొనసాగుతోంది. ఈ రెండు గోదాములు అందుబాటులోకి వస్తే 1000 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వచేసుకునే సౌకర్యం ఉంటుంది.

గోదాముల నిర్మాణం సంతోషకరం



గ్రామాల్లో గోదాములు నిర్మించడం సంతోషకరం. రైతుల పంటలను పండించుకుని అధిక ధరలకు ధాన్యం విక్రయించుకునేందుకు అవకాశం ఉంటుంది. గతంలో పండించిన పంటలను నిల్వచేసుకోలేక తక్కువ ధరకు దళారులకు విక్రయించి నష్టపోయేవాళ్లం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల కష్టాలను తీర్చాడు. ఒక్కో సచివాలయం పరిధిలో ఒక్కో గోదాము నిర్మిస్తే రైతులకు మరింతగా ప్రయోజనం చేకూరుతుంది.

- అనిల్‌కుమార్, రైతు, వెంకటరెడ్డిపాళెం

రైతుల కష్టాలను తొలగించేందుకే..



గ్రామీణ ప్రాంతాల్లో రైతుల కష్టాలను తొలగించేందుకు గోదాములు నిర్మాణం చేపట్టాం. సహకార సంఘం పరిధిలో రెండు గోదాములు నిర్మిస్తున్నాం. ఒక్కో గోదాములో 500 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వచేసుకోవచ్చు. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య చేతులు మీదుగా త్వరలో వెంకటరెడ్డిపాళెంలోని గోదామును ప్రారంభిస్తాం. తర్వాత రైతులు ధాన్యం నిల్వచేసుకునేలా చర్యలు తీసుకుంటాం. ఎమ్మెల్యే సహకారంతో పీఏసీఎస్ అభివృద్ధి చేస్తున్నాం.

- ఉచ్చూరు శోభారాణి, పీఏసీఎస్ అధ్యక్షురాలు, కురుగొండ

చెత్తతో సంపద తయారీ



చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పెళ్లకూరు: నివాసాల నుంచి వెలువడే చెత్త, చెదారాలను వర్మీకంపోస్టుగా మార్చితే సంపద సృష్టించుకోవచ్చని డీపీవో రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం అనకవోలు గ్రామంలో చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నివాసాల మధ్య నిల్వ ఉన్న మురుగునీటికి చెత్త చేరడం వల్ల దోమల వ్యాప్తి ఎక్కువై రోగాల బారిన పడతారని వివరించారు. అందువల్ల తడి, పొడి చెత్తను వేరు చేసి గ్రీన్ అంబాసిడర్ల సహాయంతో సంపద తయారీ కేంద్రాలకు చేరవేయాలన్నారు. వానపాముల సహకారంతో వర్మీకంపోస్టు ఎరువు రూపొందించి రైతులకు విక్రయించుకోవడం వల్ల రాబడి సాధించవచ్చన్నారు. తద్వారా గ్రామాల అభివృద్ధికి తోడ్పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో వెంకటరమణ, స్థానిక సర్పంచ్ చెంచురామయ్య, వీఆర్వో కల్యాణి, పంచాయతీ కార్యదర్శి మధుమోహన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సింహవాహనంపై వేణుగోపాలుడు



సూళ్లూరుపేట రూరల్: మడలంలోని మంగళంపాడు గ్రామంలో సౌదర్యవల్లీ రుక్మిణి సత్యభామా గోదా సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉదయం నుంచి ఆలయంలో తిరుచ్చి ఉత్సవం నిర్వహించి వైభవంగా పూజలు నిర్వహించారు. రాత్రి వేణుగోపాలస్వామి వారు సింహ వాహనంపై విహరించారు. అధిక సంఖ్య భక్తులు తరలి వచ్చి స్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

పది పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



వెబ్ కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ డీఈఓ, ఎంఈఓ

గూడూరురూరల్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా అధికారులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం గూడూరులోని మండల విద్యాశాఖ కార్యాలయంలో జరిగిన వెబ్‌కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ డీఈఓ శివప్రకాష్‌రెడ్డి, ఎంఈఓ దేవరాజులరెడ్డి, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు 5 మంది విద్యార్థులను దత్తత తీసుకుని పరీక్షల్లో విజయం సాధించేలా తర్ఫీదు ఇవ్వాలని సూచించారు. ప్రణాళికాబద్ధంగా విద్యాబోధన, వ్యక్తిగత శ్రద్ధ, ఉపాధ్యాయుల రాత్రి పరిశీలనతోపాటు టైమ్‌టేబుల్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. సబ్జెక్టుల వారీగా రివిజన్, పరీక్షలు నిర్వహించి విద్యార్థుల్లో ఆందోళనను పారదోలాలని సూచించారు. ప్రీ పబ్లిక్ పరీక్షలను ఎఫ్ఏ–4 గా పరిగణిస్తామన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

గూడూరు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇంట్లో అగ్ని ప్రమాదం జరిగింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో సమగ్రి దగ్ధమైంది. బాధితుడి కథనం మేరకు.. పట్టణంలోని శివాల యం వీధిలో రమేష్ అనే వ్యక్తి తన సోదరితో కలిసి నివసిస్తున్నాడు. శుక్రవారం రమేష్, అతని సోదరి పనుల కోసం బయటకు వెళ్లారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. చుట్టుపక్కల వారు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించి నా ప్రయోజనం లేకుండా పోయింది. ఇంట్లోని సామగ్రి అగ్నికి ఆహుతైంది. ఈ మేరకు రూ.50 వేల వరకు వస్తుసామగ్రి కాలిపోయినట్లు బాధితుడు రమేష్ తెలిపారు.

ఒత్తిడిని అధిగమిస్తేనే..



ప్రేరణ తరగతుల్లో మాట్లాడుతున్న సుధీర్‌బాబు

రాపూరు: పదో తరగతి విద్యార్థులు భయం వీడి, ధైర్యంగా పరీక్షలు రాయాలని సర్వశిక్షా అభియాన్ అకడమిక్ మానిటరింగ్ అధికారి సుధీర్ బాబు అన్నారు. రాపూరు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో రాపూరు, సిద్ధవరం, గురుకులానికి చెందిన పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం ప్రేరణ తరగతులను నిర్వహించారు. విద్యార్థులు పరీక్షలు సమీపించే కొద్ది భయపడడం సహజమేనన్నారు. ప్రణాళికతో చదివి మంచి మార్కులు సాధించాలని సూచించారు. ప్రముఖ మోటివేటర్ కోదండరామ్ మాట్లాడుతూ.. విద్యార్థులు బట్టీ విధానాన్ని వీడి అర్థం చేసుకుని చదదివితే పరీక్షలు బాగా రాయవచ్చని తెలిపారు. ఎంఈఓ శ్రీనివాసులు, హెచ్‌ఎంలు రేణుక, మునీంద్రరెడ్డి పాల్గొన్నారు.

కండలేరులో 44.313 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 44.313 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,210 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 100, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 60, లోలెవల్ స్లూయిస్‌కు 50, హైలెవల్ స్లూయిస్‌కు 140 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

పక్కాగా ఎన్నికల ఏర్పాట్లు



తడ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ చంద్రముని

తడ: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు పక్కాగా చేస్తున్నట్టు సూళ్లూరుపేట ఆర్డీఓ చంద్రముని తెలిపారు. ఆయన శుక్రవారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ఆయన ఏర్పాట్లు పరిశీలించారు. ఆయన విలేకరులతో మాట్లాడారు. సూళ్లూరుపేట జూనియర్ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఏర్పాటు చేసి 25 పోలింగ్ కేంద్రాలకు ఐదు రూట్ల ద్వారా ఎన్నికల సామగ్రి, సిబ్బందిని పంపుతామని తెలిపారు. జనరల్ ఓట్లకు సంబంధించి ఓటు కార్డుకి ఆధార్ లింక్ ప్రక్రియ కొనసాగుతూ ఉందని జిల్లాలో సూళ్లూరుపేట డివిజన్‌లో 2,31,869 మంది ఓటర్లకు గాను 1,93,547 మంది ఓటర్లకు ఆధార్ లింక్ పూర్తి చేసినట్లు తెలిపారు. దీంతో మన డివిజన్ 83.4 శాతంతో జిల్లాలో ప్రథమ స్థానంలో ఉందని చెప్పారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ రామయ్య, డీటీ శరత్, సర్వేయర్ నాగరాజు, ఏఎస్ఐ శ్రీకుమార్‌రెడ్డి ఉన్నారు.

ఉపాధి పనుల తనిఖీ

దొరవారిసత్రం: మండలంలోని వేణుంబాకం, ఏకొల్లు గ్రామాల పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఎంపీడీఓ సింగయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో ని అమృత సరోవర్ పథకం కింద కొత్తగా చెరువు నిర్మాణ పనులు చేపట్టారు. ఈ పనుల కొలతలు, మస్టర్ సక్రమంగా లేకపోవడంపై ఎఫ్ఏలు, టీఏలు, మేట్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి లోపాలు మళ్లీ కనిపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఉపాధి కూలీకు రోజుకు రూ.257 వచ్చేలా పనులు చేయించాలని తెలిపారు. ఆయనతోపాటు ఏపీఓ విజయ్‌భాస్కర్ ఉన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించుకుందాం

- సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



పట్టభద్రులు, ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవయ్య తదితరులు

నాయుడుపేటటౌన్: వైఎస్సార్ సీపీ మద్దతుతో బరిలో ఉన్న ఎమ్మెల్సీ అభ్యర్థులు పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని గెలిపించాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఓటర్లను అభ్యర్థించారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలలకు వెళ్లి పట్టభద్రులు, ఉపాధ్యాయులను కలసి వారితో మాట్లాడారు. పార్టీ తరపున పోటీలో ఉన్న అభ్యర్థులు శ్యాంప్రసాద్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బ్యాలెట్ పత్రాల నమూనాలు, ఓటు వేయాల్సిన విధానం తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో వివిధ పాఠశాలలు కళాశాల కరస్పాండెంట్లు, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ కటకం దీపిక, ఎన్‌డీసీసీబీ మాజీ డైరెక్టర్ కలికి మాధవ రెడ్డి, వైస్ చైర్మన్ వెంకట కృష్ణారెడ్డి, ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కట్టా వెంకటరమణారెడ్డి, చదలవాడ కుమార్, కటకం జయరామయ్య పి.రాహుల్, రవి తదితరులు ఉన్నారు.

కలువాయి: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులు పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిలను గెలిపించాలని మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం కోరారు. కుల్లూరులో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఉపాధ్యాయులు, పట్టభద్రులు తమ మొదటి ప్రాధాన్యతా ఓటును శ్యాంప్రసాద రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డిలకు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

కోట: వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా మండలంలో ఆ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఎంపీటీసీ మొబీన్, సర్పంచ్ శ్రీరాంకృష్ణస్వాతి కరపత్రాలు పంపిణీ చేశారు.

దక్కిలి: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకమని, నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చింతల శ్రీనివాసులురెడ్డి అన్నారు. శుక్రవారం మండల స్థాయి వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ నెల 7వ తేదీ దక్కిలిలో జరగనున్న ఆత్మీయ సదస్సుకు నేదురుమల్లి రాకుంమార్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. విక్రమ సింహపురి ఆర్టీసీ రీజినల్ మాజీ చైర్మన్ చెలికం శంకరరెడ్డి, ఎంపీపీ గోను రాజశేఖర్, పాదిలేటి దశరదరామరెడ్డి, నారాయణరెడ్డి, నర్రావుల వేణుగోపాల్‌నాయుడు పాల్గొన్నారు.

చిల్లకూరు: మండలంలోని పలు గ్రామాల్లో జెడ్పీటీసీ మన్నెం శీనయ్య, పార్టీ మండల కన్వీనర్ అన్నంరెడ్డి పరందామరెడ్డి శుక్రవారం ముమ్మర ప్రచారం నిర్వహించారు.

వెంకటగిరి: పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలను గెలుపునకు పార్టీ శ్రేణులు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ ఢిల్లీబాబు, సొసైటీ అధ్యక్షులు నాగేశ్వరరావు, శ్రీనివాసులురెడ్డి కోరారు. తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి వెంకటగిరి రూరల్ మండల పార్టీ శ్రేణులతో శనివారం స్థానిక ఎస్ఎల్ఆర్ కల్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

గూడూరు: తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు బత్తిని విజయ్‌కుమార్ కోరారు. పట్టణంలోని 21, 22, 23 వార్డుల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ముమ్మర ప్రచారం చేశారు. ఆయన వెంట దాసరి వెంకటేశ్వర్లు, దామోదర్, అజీజ్, వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా

పెళ్లకూరు: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థులు పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డిని, చంద్రశేఖర్‌రెడ్డి విజయమే లక్ష్యంగా ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. చెంబేడు, పునబాక, నందిమాల, అర్థమాల గ్రామాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేపట్టినట్లు ఎంపీపీ వివరించారు. జెడ్పీటీసీ సభ్యురాలు నన్నం ప్రిస్కిల్లా, ఎంపీటీసీ కుమార్ పాల్గొన్నారు.

సేవకుడిగా పనిచేస్తా.. ఆదరించండి



హాజరైన నాయకులు, ప్రజాప్రతినిధులు, మాట్లాడుతున్న నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి

–నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి

సైదాపురం: ప్రజలకు సేవకుడిగా పనిచేస్తా.. ఆదరించాలని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి అన్నారు. సైదాపురం మండలం చాగణంలోని ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో పార్టీ మండల నాయకులతో శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అంతకు ముందు చాగణం గ్రామంలో కమలపూడి కృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బస్టాండ్ సమీపంలోని వైఎస్సార్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. సాయిబాబు మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. నాయకుడిగా కాదు సేవకుడిగా వచ్చా.. మీ సమస్యలను నా సమస్యలుగా భావిస్తా.. అందరి సహకారం అవసరమని కోరారు. నియోజకవర్గ అభివృద్ధికి తన తండ్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, తల్లి రాజ్యలక్ష్మి ఎంతో చేశారని గుర్తు చేశారు. వారి బాటలోనే తన ప్రయాణం కూడా సాగుతుందని తెలిపారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఎమ్మెల్సీ మేరిగ మురళి, నియోజకవర్గ పరిశీలకులు సత్యనారాయణరెడ్డి, సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, రాష్ట్ర సంగీత నృత్య అకాడమి చైర్మన్ పాట్రేళ్ల శిరిషా, జేసీఎస్ కన్వీనర్ రవికుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట చర్యలు



స్ట్రాంగ్ రూంను పరిశీలిస్తున్న ఆర్డీఓ కిరణ్‌కుమార్

గూడూరు: ఈ నెల 13వ తేదీ జరగనున్న ఉపాధ్యాయుల, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్డీఓ కిరణ్‌కుమా ర్ తెలిపారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలోని స్ట్రాంగ్ రూంలో ఉంచిన బ్యాలెట్ బాక్సు లను శుక్రవారం పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. గూడూరుతో పాటు, చిల్లకూరు, కోట, వాకాడు, బాలాయపల్లి, డక్కిలి, వెంకటగిరి బ్యాలెట్ బాక్సులపై ఇక్కడ ఉంచారు. ఆయా మండలాల తహసీల్దార్‌లు, రూట్ అధికారులు, స్ట్రాంగ్ రూం ఇన్‌చార్జి రాంకుమార్ ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ అవసరం



పర్యావరణంపై ప్రదర్శనలు చేస్తున్న విద్యార్థులు

దొరవారిసత్రం: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని సూళ్లూరుపేట సబ్ డివిజన్ డీఎఫ్ఓ శామ్యూల్ అన్నారు. ఏకొల్లు గ్రామ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా నేలపట్టు పక్షుల కేంద్రం వన్యప్రాణి విభాగం అధికారులు విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు డీఎఫ్ఓ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఎఫ్ఆర్ఓ వరప్రసాద్, ఎఫ్ఎస్ఓ బాలయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రదర్శన

సూళ్లూరుపేట రూరల్: పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకతపై విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పిస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక హోలిక్రాస్ కూడలి వద్ద ప్లకార్డులను ప్రదర్శించారు.

అడవులను కాపాడుకోవాలి

సూళ్లూరుపేట రూరల్: అడవులను సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందని వన్యప్రాణి డివిజనల్ అధికారి శామ్యూల్ అన్నారు. స్థానిక డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ శంకర్ శర్మ ఆధ్వర్యంలో జాతీయ వన్యప్రాణి దినోత్సవం సందర్భంగా శుక్రవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వన్యప్రాణులను వేటాడితే వచ్చే నష్టాలను వివరించారు. వన్యప్రాణి సంరక్షణ చాలా అవసరమన్నారు. జంతుశాస్త్ర శాఖాధిపతి శ్రీనివాసులు పాల్గొన్నారు.

7న ఉచిత కంటివైద్య శిబిరం

సూళ్లూరుపేట: పట్టణంలోని రైల్వే క్యాబిన్‌రోడ్డులో ఉన్న జైన్ ప్రార్థన మందిరంలో ఈనెల 7వ తేదీ ఉచిత కంటివైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్టు రాజస్థాన్ సేవాసంఘ ప్రతినిధులు తెలిపారు. సంఘ ఆధ్వర్యంలో చెన్నై మెట్రో మహావీర్ క్లబ్ వారి సహకారంతో తిరుపతికి చెందిన శ్రీ వేంకటేశ్వర అరవింద్ నేత్రాలయం వైద్యులు సేవలు అందించనున్నట్లు తెలిపారు. ప్రతి నెలా మొదటి మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కంటివైద్య శిబిరాన్ని నిర్వహించి నిరుపేదలకు కంటి ఆపరేషన్లు ఉచితంగా చేయిస్తామని తెలిపారు.

ఘనంగా బడి వార్షికోత్సవం

కలువాయి: స్థానిక బీవీఎస్ఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం, సరస్వతి పూజను శుక్రవారం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు అనిల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఎంఈఓ బాలకృష్ణారెడ్డి, హెచ్ఎం జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

గూడూరు: అనారోగ్యంతో మృతి చెందిన అల్లంపాటి పద్మమ్మ కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా రూ.10 వేలు అందజేశారు. పట్టణంలోని అశోక్‌నగర్‌లో బాధిత కుటుంబానికి సచివాలయ సిబ్బంది శుక్రవారం నగదు అందజేశారు.

సీఎంకు కృతజ్ఞతాభివందనాలు



ఉద్యోగ సంఘాల నాయకులు

గూడూరు: పదేళ్ల సర్వీస్ దాటిన 13 వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడం తదితర విషయాలపై మంత్రుల కమిటీ ఇచ్చిన హామీ మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోపాటు మంత్రుల కమిటీకి ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ చైర్మన్ చేజర్ల సుధాకర్ కృతజ్ఞతాభివందనాలు తెలిపారు. పట్టణంలో ఉద్యోగ సంఘ నాయకులు శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 7వ తేదీ ఉద్యోగ సంఘాల భేటీకి ముందుగా గురువారం మంత్రుల కమిటీతో, ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ చైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి చర్చించి, డిమాండ్‌లకు మంత్రుల కమిటీ హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఉద్యోగ సంఘ నాయకులు షేక్ గౌస్ బాషా, సీహెచ్ రవి, ఉదయగిరి గోపి, నవీన్ పాల్గొన్నారు.





కుంభాభిషేక మహోత్సవాలు పరిసమాప్తం

నాయుడుపేటటౌన్: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయాల మహా కుంభాభిషేక మహోత్సవాలు పరిసమాప్తమయ్యాయి. శుక్రవారం పార్వతీ పరమేశ్వరులు, శ్రీసీతా రాములు, రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణుని కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఉదయం గోపూజతో చివరి రోజు వేడుకలను ప్రారంభించి నవగ్రహ హోమం, మహా పూర్ణాహుతి, మహా సంప్రోక్షణం, మహా కుంభ తీర్థ పూజలను వేదపండితులు శాస్త్రోక్తంగా చేశారు. ఈ వేడుకలకు సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య హాజరయ్యారు.



గ్రామోత్సవం

శుక్రవారం రాత్రి స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులతో నగరోత్సవం కోలాహలంగా జరిగింది. మహిళలు కోలాట నృత్యాలు, పలు ప్రదర్శనలు ఎంతోగానూ ఆకట్టుకున్నాయి. ఆర్యవైశ్య సంఘ నాయకుల సారథ్యంలో నగరోత్సవం అత్యంత వేడుకగా సాగింది.